సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.22,780

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22,780, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
37.5°/13.6°

జిల్లాలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తగ్గిన ఎండుమిర్చి ధర



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర తగ్గింది. గత వారం క్వింటా రూ.17 వేలపైన పలకగా ఈ వారం క్వింటాకు రూ.2 వేల మేర తగ్గింది. శుక్రవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 119.60 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో మొదటి రకం ఎండుమిర్చి క్వింటా రూ.15 వేలు, రెండో రకం రూ.8 వేలు, మూడోరకం ఎండుమిర్చి క్వింటా రూ.7 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

పుట్టపర్తిలో మలేరియా నిర్ధారణ ల్యాబ్

- ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ ఫైరోజ బేగం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

పుట్టపర్తి అర్బన్: మలేరియా నిర్ధారణ మరింత సులువు కానుంది. ఇప్పటివరకూ జిల్లాలో ప్రభుత్వ ల్యాబ్ అందుబాటులో లేక రక్త నమూనాలను అనంతపురానికి పంపేవారు. ఇక నుంచి పుట్టపర్తిలోనే మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఇందుకోసం జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమీపంలో ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ల్యాబ్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ బేగం, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఐఓ శ్రీనివాసరెడ్డి, మలేరియా అధికారి లక్ష్మానాయక్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... ల్యాబ్ అందుబాటులోకి రావడం వల్ల మలేరియా కేసులను త్వరితగతిన నిర్ధారించి చికిత్స అందించవచ్చన్నారు. జిల్లాలోని 41 పీహెచ్‌సీలు, 18 యూపీహెచ్‌సీలు, 7 సీహెచ్‌సీలు, 3 ఏహెచ్‌లు, జిల్లా ఆసుపత్రి నుంచి వచ్చే నమూనాలను పరీక్షించి రోగ నిర్ధారణ చేస్తారన్నారు. ఇందుకు అవసరమైన నాలుగు మైక్రోస్కోప్‌లు, పరికరాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అలాగే ల్యాబ్‌లో సిబ్బంది కూడా నిత్యం అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు.

ఏపీఈసెట్ నిర్వహణ బాధ్యత జేఎన్‌టీయూకే

- రాష్ట్ర కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్



అనంతపురం: ఏపీ ఈసెట్ (ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)–2025 నిర్వహించడానికి జేఎన్‌టీయూ అనంతపురానికి అవకాశం దక్కింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం తొలిసారి జేఎన్‌టీయూఏకు ఏపీ ఈసెట్ అప్పగించారు. ఇప్పటి వరకు రెండు దఫాలు (జేఎన్‌టీయూ కాకినాడ) మినహా ఏపీ ఈసెట్ బాధ్యతలు జేఎన్‌టీయూకే దక్కింది. దీంతో 8వ దఫా జేఎన్‌టీయూఏ ఈసెట్ నిర్వహించనుంది. ఏపీ ఈసెట్ రాష్ట్ర కన్వీనర్‌గా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఇప్పటికే ఐదు దఫాలు ఏపీ ఈసెట్ కోకన్వీనర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో ఏపీ ఈసెట్ రాష్ట్ర కన్వీనర్‌గా ఈయనకు అవకాశం కల్పించారు. ఏపీ ఈసెట్‌ను ఇప్పటిదాకా అత్యధిక సార్లు ఏపీ ఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి నిర్వర్తించారు. మే 6న ఏపీ ఈసెట్‌ను నిర్వహిస్తారు. డిప్లొమా పూర్తి చేసిన వారికి లేటరల్ ఎంట్రీ కింద నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్లు కల్పిస్తారు. ఇదిలా ఉండగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఒక్క సెట్ కూడా నిర్వహించే అవకాశం రాలేదు. గతేడాది ఏపీఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఏ ఒక్క సెట్టూ కేటాయించలేదు. గతంలో ఏపీ లాసెట్ నిర్వహించినప్పటికీ, బిల్లుల సమర్పణలో అలసత్వం వహించడంతో లాసెట్ సైతం అప్పగించలేదు.

వేమనా.. నీరు పారేనా?

మరమ్మతుకు నోచుకోని గేట్లు.. తూముల వద్ద దెబ్బతిన్న లైనింగ్.. కట్టకు ఎక్కడ పడితే అక్కడ చిల్లులు.. ఫలితంగా యోగి వేమన జలాశయం రైతుల ఆశలపై నీళ్లు పోస్తోంది. ఎన్నో ఆశలతో రబీ పంటలకు సిద్ధమైన ఆయకట్టు రైతుల పరిస్థితి ప్రశ్నార్థకమైంది. కూటమి ప్రభుత్వం కాలువలో కంపచెట్లు తొలగించి ప్రచార ఆర్భాటం చేస్తూ వారం రోజుల క్రితం నీరు విడుదల చేయగా.. ఎక్కడికక్కడ వృథాగా పోతోంది.

యోగివేమన డ్యాం ముఖ చిత్రం



జలాశయం కట్ట నుంచి వృథాగా పోతున్న నీరు

- మరమ్మతులకు నోచుకోని యోగి వేమన రిజర్వాయర్
- లీకేజీలతో వృథాగా పోతున్న నీరు
- జలాశయంలో తగ్గుతున్న నీటి మట్టం
- దెబ్బతిన్న లైనింగ్... కట్టకు చిల్లులు
- రైతుల రబీ ఆశలు ఆవిరి

ముదిగుబ్బ: మండలంలోని అడవిబ్రాహ్మణపల్లి తండా వద్ద చిత్రావతి నదిపై యోగివేమన రిజర్వాయర్ (వైవీఆర్) నిర్మించారు. సాగునీటి కోసం నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌పైనే మండలంలోని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఒక టీఎంసీ సామర్థ్యం గల జలాశయంలో ప్రస్తుతం 0.184 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ జలాశయం ద్వారానే మండలంలోని 5 చెరువులు, 2 కుంటలకు నీరు అందుతుంది. కాలువల ద్వారా నీరు వదలడం వల్ల సమీప ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరిగి బోర్లు రీచార్జ్ అవుతాయి. మరోవైపు రిజర్వాయర్ కింద 12,500 ఎకరాల ఆయకట్టు ఉంది. రబీలో రిజర్వాయర్ ద్వారా వదిలే నీటితోనే ఆయకట్టుతో పాటు కాలువ సమీపంలోని వందలాది ఎకరాల్లో భూములు సాగులోకి వస్తాయి.

ఆయకట్టు గ్రామాలివీ..

ఏబీపల్లి తండా, నక్కలపల్లి, నాగలగుబ్బల, దొరిగిల్లు, ఇందుకూరు, చిత్రవాండ్లపల్లి, కొడవండ్లపల్లి, ఎస్. బండ్లపల్లి, గాండ్లవారిపల్లి, సంకేపల్లి, ఎస్. బ్రాహ్మణపల్లి.

దెబ్బతిన్న గేట్లు, లైనింగ్..

యోగివేమన రిజర్వాయర్‌కు 11 గేట్లు ఉన్నాయి. అందులో 5, 6, 7, 8, 10, 11వ గేట్లు దెబ్బతిన్నాయి. మోటర్లు కాలిపోవడంతో పాటు రోప్ (తాడు) కూడా తెగిపోయింది. కంట్రోల్ బోర్డు, గేర్ వీల్స్, రబ్బర్లు, గేట్లు పెయింటింగ్ తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎక్కువ శాతం విద్యుత్‌కు సంబంధించిన పనులే ఉన్నందు వల్ల వాటిని చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇక మిగిలిన 1, 2, 3, 4, 9 గేట్లలో కూడా మైనర్ పనులు చేయాల్సి ఉంది. ఇక జలాశయం నుంచి కుడి కాలువ 18 కిలోమీటర్లు, ఎడమ కాలువ 13 కిలోమీటర్లు, గాండ్లవారిపల్లి ఉపకాలువ 6 కిలోమీటర్లు, మొత్తం 37 కిలోమీటర్ల మేర కాలువలున్నాయి. ఇటీవల కాలువలో పెరిగిన కంప చెట్లు తొలగించడం, దెబ్బతిన్న సైడ్‌వాల్స్‌ను మరమ్మతులు చేశారు. కానీ లైనింగ్ చేయకపోవడం, ప్రధాన కట్టలో ఏర్పడిన లీకేజీలను సరిచేయకపోవడం, గేట్లకు మరమ్మతు చేయకపోవడంతో జలాశయం నుంచి వదిలిన నీరంతా వృథాగా పోతోంది.

కూటమి ప్రచార ఆర్భాటం ..

వైవీఆర్ మరమ్మతులకు కూటమి ప్రభుత్వం రూ.59 లక్షలు మంజూరు చేసింది. అందులో రూ.33 లక్షలతో కాలువ పనులకు టెండర్ పిలవగా కాంట్రాక్టు దక్కించుకున్న వారు కాలువలో కంపచెట్లు తొలగింపు, ఇతరత్రా పనులు చేపట్టారు. మిగిలిన పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో నీరంతా ఎక్కడికక్కడ వృథాగా పోతుండగా.. ఇప్పటికే వెచ్చించిన ప్రజాధనం నీటిపాలైంది.



దెబ్బతిన్న గేట్లకు సంబంధించిన వీల్స్

లీకేజీలను అరికట్టండి



వైవీఆర్‌కు ఏర్పడిన లీకేజీల కారణంగా నీరంతా వృథాగా పోతోంది. డ్యాం గేట్లు సరిగా లేకపోవడంతో వాటి ద్వారా అధికంగా నీరు కింద ప్రాంతానికి వెళ్లిపోతోంది. దీంతో నీటి మట్టం బాగా తగ్గింది. లీకేజీలను అరికట్టి ఆయకట్టుకు నీరు వదిలితే రైతులకు మేలు జరుగుతుంది. – రామకృష్ణారెడ్డి, రైతు, బూదనంపల్లి

మరమ్మతులు చేస్తేనే ఉపయోగం



యోగివేమన జలాశయం ద్వారా చెరువులు, కుంటలకు నీరు సరఫరా అవుతుంది. తద్వారా సమీప ప్రాంతాల్లోనూ భూగర్భ జలమట్టం పెరుగుతుంది. ఆయకట్టు రైతులకూ సాగునీరందుతుంది. కానీ డ్యాం లీకేజీల కారణంగా నీరంతా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి. లేకపోతే వైవీఆర్ వల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదు.

– సూర్యనారాయణ, రైతు, గాండ్లవారిపల్లి

త్వరలో రీ టెండర్లు పిలుస్తాం

డ్యాం మరమ్మతు పనులకు ఇప్పటికే టెండర్లను పిలిచాం. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. వారు ఇచ్చిన ఆదేశాల మేరకు మరోసారి రీ టెండర్లను పిలుస్తాం. వీలైనంత త్వరగా మరమ్మతు పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కృష్ణకుమార్, డ్యాం ఏఈ

సత్యసాయి కీర్తిని ప్రపంచమంతా చాటాలి

- బాబా శత జయంతి వేడుకలకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశం



సత్యసాయి శతజయంతి వేడుకలపై సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: సత్యసాయి కీర్తిని ప్రపంచమంతా చాటేలా బాబా శతజయంత్యుత్సవాలు నిర్వహిద్దామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ జిల్లా యంత్రాంగానికి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులతో సమావేశమయ్యారు. నవంబర్‌లో జరిగే సత్యసాయి శత జయంతి వేడుకల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... సత్యసాయి శత జయంత్యుత్సవాలకు దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. జయంత్యుత్సవాల్లో పాల్గొనే భక్తులను అంచనా వేసి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సహకారంతో ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ శాఖల అధికారులు పార్కింగ్ కోసం స్థలాలు పరిశీలన చేయాలన్నారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని చారిత్రక ప్రదేశాలను సుందరీకరణ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మొబైల్ టాయిలెట్లు, రవాణా సేవలు, రక్షిత తాగునీరు, తాత్కాలిక బస్‌స్టేషన్లు, వసతి సౌకర్యం కల్పనకు సంబంధించిన నివేదికలను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేయాలన్నారు. శానిటేషన్ కోసం ఇతర మున్సిపాలిటీల నుంచి సిబ్బందిని నియమించుకోవాలన్నారు. సమావేశంలో సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు చలం, రోమెల్, డీఎఫ్‌ఓ చక్రపాణి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రనాథ్, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్యతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం



దామోదరం సంజీవయ్య జయంతి సభలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- నివాళులర్పించిన అధికారులు

పుట్టపర్తి టౌన్: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం దామోదర్ సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా స్థానిక సాయి ఆరామంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... సంజీవయ్య కర్నూలు జిల్లా పెద్దపాడు గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. 38 ఏళ్ల వయసులోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఘనత సంజీవయ్యకే దక్కుతుందన్నారు. అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు సంజీవయ్య మారు పేరుగా నిలిచారన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి అనేక ఉన్నత పదవులు అలంకరించిన దామోదరం సంజీవయ్య అడుగుజాడల్లో యువత నడవాలన్నారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు కూడా మరవలేనివన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, డీఎస్పీ విజయకుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్‌తో పాటు వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోనూ వేడుకలు

ప్రశాంతి నిలయం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ చేతన్ దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులందరికీ కంటి పరీక్షలు

- కలెక్టర్ టీఎస్ చేతన్



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 1,11,614 మంది విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా అద్దాలు అందిస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బుక్కపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..దృష్టి లోపం ఉన్న విద్యార్థులు కళ్లజోడు ధరించేందుకు మొహమాట పడకూడదన్నారు. కళ్లజోడు ఉపయోగాలు, వాడకం గురించి విద్యార్థులకు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ కృష్ణప్ప, జిల్లా వైద్యాధికారి ఫైరోజబేగంతోపాటు వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలు పరిష్కరించండి

ప్రశాంతి నిలయం: నియోజకవర్గ ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టర్‌లో ప్రత్యేకాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రత్యేకాధికారులుగా ఉన్న ఆర్డీఓలకు నియోజకవర్గంలోని అన్ని శాఖలపై పూర్తి బాధ్యత ఉంటుందని, దీన్ని గుర్తించి పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు చేయాలన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మెడికల్ షాపుల లైసెన్స్‌లు కూడా పరిశీలించాలన్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఐదేళ్ల విజన్ ప్రణాళికలకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. పింఛన్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూమి ఏ గ్రామంలో ఎంత ఉందన్న వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, మడకశిర నియోజకవర్గ ప్రత్యేకాధికారులు సువర్ణ, మహేష్, శర్మ, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన


దేశభక్తిని చాటేలా..

బాలోత్సవం.. భళా !



- ఆటపాటలతో సందడిగా ప్రారంభమైన పిల్లల పండుగ
- చదువుతో పాటు కళల్లోనూ ప్రోత్సహించాలన్న వక్తలు

అనంతపురం కల్చరల్: చదువుల్లోనే కాదు తాము ఏ రంగంలోనైనా తీసిపోమని చిన్నారులు చాటి చెప్పారు. తాము వేదికెక్కితే కరతాళధ్వనులు ఎలా మారుమోగుతాయో నిరూపించారు. విద్యార్థుల్లోని ప్రతిభాపాటవాలు, నైపుణ్యాలను వెలికి తీయడానికి దోహదపడుతున్న బాలోత్సవం శుక్రవారం అనంతపురం నగరంలోని లలితకళా పరిషత్తు, గిల్డ్ ఆఫ్ సర్వీసు ప్రాంగణాల్లో ప్రారంభమైంది. ఆటపాటలు, వివిధ రకాల పోటీలలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జాలువారిన సృజన

లలితకళాపరిషత్తులో శాస్త్రీయ, జానపద నృత్యాలు, ఫోక్, లలిత సంగీతం, వివిధ రకాల వేషధారణలు, సందేశాత్మక నాటికలు వంటి కళాత్మక అంశాల్లో చిన్నారులు పాలుపంచుకున్నారు. అలాగే గిల్డ్ ఆఫ్ సర్వీసు ప్రాంగణంలో వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం, బొమ్మలు చేయడం, పత్రికా పఠనంతో పాటూ సైన్సు ప్రయోగాలతో చిన్నారులు అబ్బురపరిచారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పట్నం శివప్రసాద్ శిష్యబృందాల స్వాగత శాస్త్రీయ నృత్యాలు, గణేషస్తుతితో కార్యక్రమాలను ప్రారంభించారు.

బాల్యాన్ని కాపాడుకుందాం

ఎంతో అందమైన బాల్యాన్ని ఒత్తిడి నింపే చదువుతోనూ, హాని కల్గించే సాంకేతిక పరిజ్ఞానంతో కాకుండా మనో విజ్ఞానాన్ని కల్గించే కళలు, ఆటపాటలతో కాపాడుకుందామని బాలోత్సవ కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా, జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటూ సాగే బాలోత్సవాన్ని వీసీతో పాటు లలితకళాపరిషత్తు కార్యదర్శి పద్మజ, ఐద్వా నాయకురాలు సావిత్రి, పలువురు కళాకారులు, విద్యావేత్తలు, మాజీ సైనికులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యాన్ని చిదిమేసే అనేక సంఘటనలు విద్యా సంస్థల ద్వారానే సాగుతుండటం బాధాకరమన్నారు. చిన్నారుల్లోని సృజనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా తెస్తున్న విప్లవంతో మొదట పాడవుతున్నది విద్యార్థులేనని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. తొలిరోజు విజేతలుగా నిలిచిన చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, సీపీఎం నేత రాంభూపాల్, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ, బాలోత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస రావు, రామాంజనమ్మ, నాగేంద్ర పాల్గొన్నారు.





జెండా ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు, నాటకంలో భాగంగా చిన్నారుల ప్రదర్శన, తిలకిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

క్లుప్తంగా

నేడు రేడియో రైతు దినోత్సవం

అనంతపురం సిటీ: అనంతపురంలోని జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో రేడియో రైతు దినోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ జి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ మహమ్మద్ వసీం గౌరవ అతిథులుగా రానున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీ సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతులు హాజరవుతారని తెలిపారు. ముందుగా 10.45 గంటలకు తెలుగుతల్లి విగ్రహం నుంచి జెడ్పీ వరకు ఎడ్లబండిలో చేరుకుంటారన్నారు. ఉమ్మడి జిల్లా రైతులు పెద్ద ఎత్తున తరలిరానున్నట్లు వివరించారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం, బ్యూటీషియన్, టైలరింగ్ ఉచిత కోర్సులను స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ ఆ పై చదివిన వారు కోర్సులను నేర్చుకోవడానికి అర్హులన్నారు. శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు సొంత వ్యాపారాలు చేసుకునే వారికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు సెల్ నంబర్ 9966682246ను సంప్రదించాలని కోరారు.

కరెంటు సరఫరా చేయండి సారూ..

- సబ్‌స్టేషన్ ఎదుట తమ్మడేపల్లి రైతుల ధర్నా


తమ్మడేపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

అమరాపురం: వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల పరిధిలోని తమ్మడేపల్లి రైతులు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తామంతా దీర్ఘకాలిక పంటలైన వక్క, తమలపాకు తోటలతో పాటు ఉల్లి, రాగి, దానిమ్మ, వేరుశనగ తదితర పంటలు సాగుచేస్తున్నామని, విద్యుత్ కోతలతో బోర్లు పనిచేయక పంటలు ఎండుముఖం పట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేళాపాలా లేకుండా విద్యుత్ సరఫరాలో కోతలు పెడుతుండటంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులకు సమస్య తెలిపి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని విద్యుత్ శాఖ సిబ్బంది తెలపడంతో ధర్నా విరమించారు. ధర్నాలో రైతులు సిద్దప్ప, గిరీష్, అనిల్‌కుమార్, సిద్దేశ్వర, హనుమంతరాయ, నాగరాజు, అనుమంతి, కాంతరాజు, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త పొలానికి మళ్లీ నిప్పు

రాప్తాడు: మండలంలోని పుల్లలరేవు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఓబులేష్, వసంత్‌కు చెందిన పొలానికి మళ్లీ నిప్పు పెట్టారు. బాధితుల వివరాలమేరకు.. మండలంలోని గొందిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధి (పులల్లరేవు) పరిధిలోని సర్వే నంబర్ 103-2 (88-3)లో 4.90, 103-3 (88-3)లో పెద్ద ఓబులేష్, వసంత్ తమకున్న 7.76 ఎకరాల వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ పొలంలో రెండేళ్ల క్రితం దాదాపుగా 400 అల్ల నేరేడు మొక్కలను నాటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఓబులేష్‌కు చెందిన మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ ఏడాది జనవరి 17న 15 చెట్లు, అలాగే జనవరి 21న 40 చెట్లను టీడీపీ నాయకులు నరికి వేశారు. మళ్లీ ఈ నెల 3న గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఓబులేష్ తోటకు నిప్పు పెట్టడంతో కొన్ని చెట్లు కాలిపోయాయి. వారం రోజులు కూడా గడవక ముందే మళ్లీ ఈ నెల 10న మరో సారి నిప్పు పెట్టడంతో తోటలోని డ్రిప్ పరికరాలు, మోటర్ సెల్ పూర్తిగా కాలిపోయాయి. 10 రోజులు కూడా గడవక ముందే మూడోసారి పొలానికి నిప్పు పెట్టడంతో దాదాపుగా 4 ఎకరాల్లో పొలం చుట్టూ ఉన్న ముళ్ల కంప కాలిపోయింది. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


కళ్ల సాలకు నిప్పు పెట్టడంతో కాలిపోయిన దృశ్యం

200 మామిడి చెట్లు దగ్ధం

ముదిగుబ్బ: మండల పరిధిలోని మద్దన్నగారిపల్లి చెందిన రైతు చిన్నగాని నరసింహయాదవ్ మామిడి తోటకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పూతకు వచ్చిన 200 మామిడి చెట్లు కాలిపోయాయి. అదే విధంగా పీవీసీ పైపులు, డ్రిప్పు పరికరాలు తదితర పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి.

హత్యాయత్నం కేసులో ముద్దాయి అరెస్టు



ముద్దాయిని అరెస్టు చూపుతున్న పోలీసులు

పరిగి: మండలంలోని బీచిగానిపల్లిలో గత గురువారం భార్యపై జరిగిన హత్యాయత్నం కేసులో భర్త కరియప్పను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. నిర్మలపై భర్త కరియప్ప దాడి చేసిన సంఘటనలో నిందితుడిని హైవే 544ఈఈపై నేతులపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచామన్నారు.

అప్పు చెల్లించనందుకు ఆరు నెలల జైలు

పెనుకొండ: అప్పు తీసుకుని సుదీర్ఘంగా చెల్లించని ఓ వ్యక్తికి పెనుకొండ న్యాయమూర్తి సయ్యద్ ముజిబ్ పసలుల్లా 6 నెలల జైలు శిక్షతో పాటు రుణం మొత్తానికి డబుల్ మొత్తం చెల్లించాలని శుక్రవారం తీర్పునిచ్చారు. కదిరికి చెందిన సూర్యనారాయణ పెనుకొండకు చెందిన మహేష్‌తో 5 సంవత్సరాల క్రితం రూ. 3.24 లక్షలు తీసుకుని బాకీ పడ్డాడు. అయితే బాకీ మొత్తం చెల్లించకపోవడంతో మహేష్ పెనుకొండ కోర్టును ఆశ్రయించారు. పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి సూర్యనారాయణకు 6 నెలల జైలు శిక్షతో పాటు తీసుకున్న మొత్తానికి డబుల్ మొత్తం చెల్లించాలని తీర్పు నిచ్చారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు సూర్యనారాయణను పెనుకొండ సబ్‌జైల్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయిలో రాణించడం అభినందనీయం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈఓ క్రిష్టప్ప

పుట్టపర్తిటౌన్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం అభినందనీయమని డీఈఓ క్రిష్టప్ప కొనియాడారు. 2024–25 సంవత్సరం రాష్ట్రస్థాయిలో స్కూల్ గేమ్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 21 మంది విద్యార్థులకు శుక్రవారం బుక్కపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన గణేష్, హాకీలో తృతీయ స్థానంలో నిలిచిన ప్రశాంత్‌రెడ్డి, లోకేష్ తో పాటు స్విమ్మింగ్, జిమ్నాస్టిక్, వెయిట్ లిఫ్టింగ్, బాల్ బాడ్మింటన్‌లో రాణించిన విద్యార్థులను అభినందించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులందరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగదీష్, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు నిప్పు


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పావగడ: పట్టణ పరిధిలోని ఉత్తర పినాకిని లేఅవుట్ సమీపంలో రైతు శ్రీనివాస్‌కు చెందిన 3 ఎకరాల్లోని కొబ్బరి, జామ, సపోట, దానిమ్మ, నేరేడు, నిమ్మతోట శుక్రవారం అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో అంతు చిక్కలేదని, సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం జరిగిందన్నారు. పంట నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు. అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ ద్వారా సమాచారం అందించినా సంఘటనా స్థలానికి చేరుకునేలోపలే నష్టం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మామిడి చెట్లకు నిప్పు


కాలిపోయిన మామిడి చెట్లు

లేపాక్షి: మండల పరిధిలోని పూలమతిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మామిడి చెట్లకు నిప్పు పెట్టారు. బాధితుల వివరాలమేరకు.. పూలమతికి చెందిన నారాయణప్ప, అంజినప్ప, నాగప్ప, గంగప్ప, నంజప్ప, పి.అంజినప్ప పదెకరాల్లో మామిడి తోటలు సాగు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో 8 ఎకరాల్లోని దాదాపు 500 చెట్లు కాలిపోయాయి. పూత దశలో ఉన్న చెట్లు కాలిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

'కూటమి' సంస్కరణలు అర్థరహితం


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి

ఎన్‌పీకుంట: ప్రభుత్వం తీసుకొచ్చిన అర్ధరోజు కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ అర్థరహితమని, పాత పద్ధతిలోనే కాంప్లెక్స్ సమావేశాలు కొనసాగించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు అర్థరహితంగా ఉన్నాయని విమర్శించారు. ప్రతి నెలా మూడో శనివారం అర్ధరోజు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలంటూ షెడ్యూలు విడుదల చేయడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయం ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందికరమని ధ్వజమెత్తారు. మధ్యాహ్నం వరకూ పాఠశాలలు నిర్వహించిన ఉపాధ్యాయులు 20 నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణించి కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావడం అసంజసమని, సరైన రవాణా సౌకర్యాలు లేని మారుమూల పల్లెల్లో విధులు నిర్వహించే మహిళా ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందికరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు రామాంజులుయాదవ్, రహీం, షఫీ, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లిలో కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కనగానపల్లికి చెందిన పూజారి తిక్క బీరప్పకు 300 పైగా గొర్రెలు ఉన్నాయి. వాటిలో చిన్న పిల్లలను గూళ్ల కింద వదిలేసి ఉదయం మేత కోసం గొర్రెల మందను సమీపంలోని పొలాల్లోకి వేసుకొని వెళ్లాడు. అయితే ఆ తర్వాత గ్రామంలోని ఊర కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేసి మెడలు, కాళ్లు కొరికేశాయి. దీంతో 30 గొర్రె పిల్లలు మృతి చెందాయి. మరో 10 పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి. చేతికి వచ్చిన 30 గొర్రె పిల్లలు మృతి చెందటంతో రూ.2 లక్షల దాకా నష్టపోయానని తిక్క బీరప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

మంటలు ఆర్పబోయి వృద్ధుడి మృతి

ముదిగుబ్బ: మండల కేంద్రం సమీపంలోని కాకతీయ డాబా సమీపంలో మామిడి తోటకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మామిడి తోటను ముదిగుబ్బకు చెందిన కొలిమి నాగప్ప (84) అనే వృద్ధుడు లీజుకు తీసుకొని తోటకు కాపలాగా ఉంటున్నాడు. మంటలను ఆర్పే ప్రయత్నంలో వృద్ధుడు కింద పడిపోయాడు. అయితే మంటలు వృద్ధున్ని చుట్టుముట్టడంతో మంటల్లో కాలిపోయి మృతి చెందాడు. మృతుని మనువడు రామాంజినేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

- రెండు నెలల పాటు ఎంఎన్‌ఓ సస్పెన్షన్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అనస్తీషియా టెక్నీషియన్ కోర్సు చేస్తున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలపై మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్‌ఓ) చిన్నప్పయ్యను రెండు నెలల పాటు సస్పెండ్ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే... గత నెలలో ఆపరేషన్ థియేటర్‌లో ఎంఎన్‌ఓ చిన్నప్పయ్య అసభ్యంగా ప్రవర్తించాడని సదరు విద్యార్థిని సర్వజనాస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై నెల రోజులు తర్వాత ఆస్పత్రి అధికారులు స్పందించారు. ఆర్ఎంఓ ఆధ్వర్యంలో విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఎన్‌ఓ చిన్నపయ్యను రెండు నెలల పాటు సస్పెండ్ చేశారు.

ప్రారంభమైన అతిరుద్ర మహాయజ్ఞం


ప్రత్యేక అలంకరణ నడుమ మహా శివలింగం

ప్రశాంతి నిలయం: సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని విశ్వశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ శుక్రవారం అతిరుద్ర మహాయజ్ఞం ప్రారంభించింది. చెన్నైకి చెందిన శ్రీనివాస్ శర్మ నేతృత్వంలో 180 మంది రుత్వికుల ఆధ్వర్యంలో ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు యజ్ఞం కొనసాగనుంది. శుక్రవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజతో అతిరుద్ర మహాయజ్ఞం ప్రారంభమైంది. అనంతరం అర్చకులు పలు పూజలు నిర్వహించారు. సాయంత్రం అతిరుద్ర మహా యజ్ఞం ప్రాధాన్యత, ఫలితాలను ఉద్దేశించి ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ వివరించారు. అనంతరం కలశ స్థాపన, మహన్యాస పారాయణం, ఏకాదశ రుద్ర అవాహనం, షోడశ ఉపచార పూజ, కర్మార్చనం, అష్టావధాన సేవ నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు దంపతులు యజ్ఞ క్రతువులో పాల్గొన్నారు. సత్యసాయి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.


గోపూజ నిర్వహిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ దంపతులు


వేదపఠనం చేస్తున్న పండితులు